# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు నాటి నుంచి సువిధ పోర్టల్ ద్వారా 73 వేల 379 అనుమతి అభ్యర్థనలు అందాయని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.
- ❖ రాష్ట్రంలో రాగల రెండు రోజులలో పలు ప్రాంతాలలో తేలికపాటి నుండి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.
- ❖ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని "నా ఆరోగ్యం-నా హక్కు" నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా అవగాహనా ర్యాలీలు నిర్వహించారు.
- ❖ సకల జీవులకు ప్రాణాధారమైన నీటిని పొదుపు చేస్తూ భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలోకి వచ్చిన నాటి నుంచి "సువిధ" పోర్టల్ ద్వారా 73 వేల 379 అనుమతి అభ్యర్థనలు అందాయని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ 20 రోజులలో రాజకీయ పార్టీల నుండి అందిన అభ్యర్థనలలో 44 వేల 626 ఆమోదించబడ్డాయని తెలిపింది. 11 వేల 200 అభ్యర్థనలు తిరస్కరించినట్టు పేర్కొంది. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించింది.

సువిధ పోర్టల్ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించడం, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు తెరవడం, ఇంటింటికి ప్రచారం చేయడం, వీడియో వ్యాన్లు, హెలికాప్టర్లు, వాహన అనుమతులు పొందడం, కరపత్రాలు పంపిణీ చేయడం వంటి వాటిపై అనుమతులను అందిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ పిలుపు నిచ్చారు. ఈరోజు ఓటర్ల అవగాహనపై మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటుపై అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, ప్రజలను చైతన్య

పరుస్తూన్నామన్నారు. తద్వారా అర్హులైన అందరినీ ఓటర్ గా నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మానవాళికి, జీవులకు ప్రాణాధారమైన నీటిని పొదుపు చేస్తూ భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఒక ప్రకటన ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంకుడు గుంతలు నిర్మించి ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని పేర్కొన్నారు. వేసవికాలంలో నీటి ఎద్దడి పరిష్కారినికి జీవీఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జీవీఎంసీ సరఫరా చేసే నీటి పైప్ లైన్ లలో, పబ్లిక్ కుళాయిలలో లీకులు, అంతరాయాలకు 9154109610, 0891-2746672 ఫోన్ నెంబర్లకు తెలియపరిచి నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని కమిషనర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో రాగల రెండు రోజులలో పలు ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తాంధ్రా, రాయలసీమ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశమ ఉందని వెల్లడించింది. ఇలా ఉండగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఈరోజు ఉదయం తేలికపాటి వర్షాలు కురిశాయి. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవరోజు అయిన ఈరోజు మహాదుర్గ అలంకారంలో శ్రీశైల భ్రమరాంబికాదేవి అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఈ సాయంకాలం కైలాసవాహనంపై స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీశైలం పురవీధులలో గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ పెరగడంతో స్వామివారి దర్శనానికి సుమారు 7 గంటల సమయం పడుతోంది. ఈ ఉత్సవాలు ఈనెల 10వ తేదీ వరకు జరగనున్నాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి ఒక్కరు ఆరోగ్య వంతమైన జీవన శైలిని అలవర్చుకోవాలని విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు పిలుపునిచ్చారు. ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా "నా ఆరోగ్యం - నా హక్కు" నినాదంతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని 1948 నుంచి పాటిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికి సురక్షితమైన తాగునీరు, ఆరోగ్యకరమైన వాతావరణం, సుచికరమైన ఆహారం, చక్కని గాలి, వెలుతురు ఉన్న ప్రదేశంలో నివసించుట కనీస హక్కులని పేర్కొన్నారు. వ్యాధుల నివారణలో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరులో అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షన్మోహన్ పాత్రికేయులతో మాట్లాడుతూ, మెరుగైన జీవితం కోసం ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని, అలాగే దూరాలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భముగా తిరుపతిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎ.ఆర్.రెడ్డి ఆకాశవాణితో మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేస్తూ, ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణీకుల కోసం ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చెన్నై- భువనేశ్వర్ మధ్య నడిచే ప్రత్యేక రైలు మే 6, 13, 20, 27, జూన్ 3 తేదీల్లో అర్ధరాత్రి 11.45 గంటలకు చెన్నైలో బయలుదేరి, ఆ తర్వాత రోజు ఉదయం 11 గంటల 15 నిమిషాలకు దువ్వాడ చేరుకుంటుందని తెలిపారు. మే 7, 14, 21, 28, జూన్ 4 తేదీల్లో భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు రాత్రి 9 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటల 42 నిమిషాలకు దువ్వాడ చేరకుంటుందని తెలిపారు. వీటితో పాటు ఎర్నాకుళం-బ్రహ్మపుర-ఎర్నాకుళం, చెన్నై ఎగ్మోర్-సంత్రాగచ్చి- చెన్నై ఎగ్మోర్ మధ్య దువ్వాడ మీదుగా అన్ రిజర్వుడ్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలకు సంబంధించిన ఈవిఎంలను భద్రపరచే ఇంటీరియం స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను సంబంధిత ఈ ఆర్ ఓ లతో కలిసి తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవిఎంలను భద్రపరచే సెంటర్లను పరిశీలించిన అనంతరం స్థానిక శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం ప్రాంగణంలో చంద్రగిరి నియోజకవర్గం లోక్ సభ, శాసన సభ కు సంబంధించిన ఈవిఎం లను భద్రపరచు ఇంటీరియం స్ట్రాంగ్ రూంను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతి కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు అయిన ఈరోజు ఉదయం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో సీతాలక్ష్మణ సమేత కోదండరాముల వారి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =